మానేరు

# జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

29.3.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 338 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ, ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఆర్‌సీబీ ఘన విజయం

హైదరాబాద్‌పై కోహ్లీ, పడిక్కల్ విజృంభణ





# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు

మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం

దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం

మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**జనతా న్యూస్, రంగారెడ్డి :** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట

మిగతా 2 లో



## మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

అక్రమాలను సహించేది లేదని వెల్లడి

ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం

అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

## మీబెదిరింపులకు భయపడం

మూసీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ భారీ దోపిడీ

కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది

ప్రజాక్షేత్రంలో నిన్ను దోషిగా నిలబెడతాం

అంబేద్కర్ విగ్రహం తాళాలు తీయనిపక్షంలో బద్దలు కొడతాం

బీఆర్ఎస్పీ సమావేశంలో కేటీఆర్



03

ప్రజాసంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తూ అవినీతి కుంభకోణాలతో ప్రజాధనాన్ని కాంగ్రెస్ పాలకు దోచుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. రేవంత్రెడ్డి అవినీతిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

## కంచె చేను మేసినట్లుగా ఉంది



03

మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా

నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది

మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్

హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు

## కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం

కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు

మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు.






## నోయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమనాశ్రాయం

ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు.

04

## ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

తదుపరి తమ టార్గెట్ క్యూబా అంటూ హెచ్చరిక



.. వివరాలు 4లో

## ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం

అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

.. వివరాలు 4లో



# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

## గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం

## ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం



**హైదరాబాద్,మార్చి 28 :** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

## రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

## అక్రమాలను సహించేది లేదని వెల్లడి

## ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం

## అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్,మార్చి28 :** మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మొదటి పేజీ తరువాయి



మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

## అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

## మెట్రో విస్తరణకు మార్గం సుగమం

## తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి28 :** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

# ఆర్‌బిఎల్ కుంభకోణంలో 139 కోట్ల లావావేవీలు

## 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

## సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన బ్యాంక్ సిబ్బంది

**కరీంనగర్,మార్చి 28 :** కరీంనగర్ కేంద్రంగా సాగుతున్న ఒక భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను కరీంనగర్ పోలీసులు ఛేధించారు. స్థానిక ఆర్‌బిఎల్ బ్యాంకును వేదికగా చేసుకుని సుమారు 139 కోట్ల రూపాయల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. 'ఆపరేషన్ క్రాక్ డౌన్'లో భాగంగా సాగించిన ఈ విచారణలో మ్యూల్ అకౌంట్ల ద్వారా సాగుతున్న ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటివరకు బ్యాంకు సిబ్బందితో సహా మొత్తం 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మోసంలో విస్తుపోయే నిజం ఏమిటంటే, సాక్షాత్తు బ్యాంకు మేనేజర్ , క్యాషియర్ నేరగాళ్లతో చేతులు కలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లో బాధితుల నుండి కొట్టేసిన సొమ్మును ఈ బ్యాంకులోని కరెంట్ అకౌంట్లలోకి మళ్లించేవారు. నిందితులకు సహకరించినందుకు గాను బ్యాంకు సిబ్బంది భారీగా లబ్ది పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులు సుమారు 2,000 మందితో ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, కమిషన్ల ఆశ చూపి సామాన్య ప్రజల పేరుతో ఖాతాలను తెరిపించారు. ప్రతి లక్ష రూపాయల లావాదేవీకి అకౌంట్ హోల్డర్‌కు రూ. 2,000 కమిషన్ ఇస్తూ, వారి ఖాతాలను కేవలం ఒక ముసుగులా వాడుకున్నారు. బ్యాంకులోని కరెంట్ అకౌంట్ల ద్వారా జరిగిన ఈ వందల కోట్ల లావాదేవీలు పోలీసులకు అనుమానం కలిగించాయి. ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల సొమ్ము ఇక్కడికే చేరుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ అక్రమ సొమ్ము కేవలం దేశానికే పరిమితం కాకుండా చైనా , దుబాయ్ వంటి దేశాలకు కూడా మళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్‌బిఎల్ బ్యాంకుతో పాటు నగరంలోని మరో రెండు మూడు ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా ఇదే తరహా అక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం అరెస్ట్ అయిన 13 మంది నిందితులను విచారిస్తున్న పోలీసులు, ఈ చైన్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంత మంది కీలక వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇచ్చి అనవసరమైన చిక్కుల్లో పడకూడదని, తక్కువ శ్రమతో వచ్చే అదనపు ఆదాయం వెనుక పెద్ద మోసాలు ఉండవచ్చని కరీంనగర్ పోలీస్ యంత్రాంగం హెచ్చరిస్తోంది. 'ఆపరేషన్ క్రాక్ డౌన్' ద్వారా ఈ నెట్‌వర్క్ మూలాలను పూర్తిగా ఛేధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

## ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన

**హైదరాబాద్,మార్చి28 :** హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఫుట్‌బాట్ క్రీడాకారిణి పట్ల అసభ్య ప్రవర్ధన

## పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్,మార్చి28 :** జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణితో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. కుక్క విషయంలో మొదలైన గోడవ చివరకు క్రీడాకారిణి కుటుంబానికి ప్రాణభయంగా మారింది. కొందరు మందుబాబులతో క్రీడాకారిణికి కుక్క విషయంలో గొడవ జరిగింది. దీంతో వారు ఆమెను వేధించడం ప్రారంభించారు. హయత్ నగర్ పరిధిలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి క్రీడాకారిణి, ఆమె చెల్లెళ్లతో అసభ్యంగా ప్రవర్తించారు. రోజూ వారి ఫోటోలు తీసి వేధిస్తున్నారు. మందుబాబుల దాడిలో గాయపడిన క్రీడాకారిణి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిచారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 29 మార్చి 2026


# మీ బెదిరింపులకు భయపడం

**మూసీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ భారీ దోపిడీ**

**కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది**

**ప్రజాక్షేత్రంలో నిన్ను దోషిగా నిలబెడతాం**

**అంబేద్కర్ విగ్రహం తాళాలు తీయనిపక్షంలో బద్దలు కొడతాం**

**బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్**



**హైదరాబాద్ :** ప్రజాసంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తూ అవినీతి కుంభకోణాలతో ప్రజాధనాన్ని కాంగ్రెస్ పాలకు దోచుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. రేవంత్రెడ్డి అవినీతిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని చెప్పారు. రేవంత్ రెడ్డి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో దోషిగా, అనినీతి పరుడిగా నిలబెట్టేంతవరకు అలుపెరగనిపోరాటం చేయనున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. అంబేద్కర్ విగ్రహానికి తాళాలు తీసి ప్రజలదర్శనం కోసం చర్యలు తీసుకోని పక్షంలో ఏప్రిల్ 14న తాళాలు బద్దలు కొట్ట నున్నట్లు స్పష్టంచేశారు. శనివారం తెలంగాణ భవన్ లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్వి సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ విదానాలను తూర్పార బట్టారు. మూసీప్రాజెక్ట్ పేరుతో జరుగుతున్న అవినీతిపై కేటీ ఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ముల కోసం మూసీ పేరిట రూ.లక్షన్నర కోట్ల ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 16 వేల కోట్లతో రూపొందించిన సమగ్ర ప్రణాళికను పక్కన పెట్టి, భారీ అంచనాలతో అవినీతి కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించా రు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి మార్గం సుగమం చేశారని విచారం వ్యక్తం చేశారు.

**పేదల ఇళ్లు కూల్చి కార్పొరేట్కు ధారాదత్తం చేస్తారా?**

మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చేసి, దాదాపు 3000 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వవైఖరికి నిదర్శనమని చెప్పారు. మూసీ పేరిట జరుగుతున్న అవినీతి చర్యలను జాతీయ స్థాయి ప్రముఖులు కూడా వ్యతిరేకిస్తున్నారని, గాంధీ కుటుంబ సభ్యులు సైతం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి దేవుడి పేరును ఉపయోగించి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అవినీతిని ప్రశ్నిస్తే "శివతాండవం చేస్తాను" అంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమనిఫైర్ అయ్యారు

# కంచె చేను మేసినట్లుగా ఉంది

**మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా**

**నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది**

**మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్**

**హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క**



**హైదరాబాద్,మార్చి28 :** అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్ట్రక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై

విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు.

వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు సభలో సంచలన కామెంట్స్ చేశారు. తన వ్యాఖ్యలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ విసిరారు. వ్యాపారం చేయడం తప్పు కాదని... కానీ మైనింగ్ లైసెన్స్ లేకుండా క్రషర్ నడపడం తప్పన్నారు. క్రషర్కు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు అనుమతి ఇవ్వాలని.. కేంద్ర పర్యావరణ అనుమతులు అవసరం లేదని హరీశ్ వెల్లడించారు. వెంటనే ప్యానెల్ స్పీకర్ బాలు నాయక్ స్పందిస్తూ.. 'హరీష్ రావు మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి' అని కోరారు. వెంటనే హరీశ్ రావు మైక్ కట్ చేసిన స్పీకర్.. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో పాల్వాయి హరీశ్ మాట్లాడుతుండగా సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చతో అసెంబ్లీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

**నియామకాల్లో తీరని జాప్యం**

**ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి**

**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్**

**హైదరాబాద్,మార్చి28 :** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్ఎస్ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్ను ఎందుకు తగ్గించారని హరీశ్రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷-లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

**పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**

**అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ**

**అంగన్వాడీలకు సెల్ఫోన్లు అందచేత**

**హైదరాబాద్,మార్చి 28 :** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్రెడ్డి పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

**అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం**

**కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు**

**మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్**



**కరీంనగర్,మార్చి 28 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్రెడ్డి, కేసీఆర్లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

**డిమాండ్ బుక్స్లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి28 :** కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్చాట్లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పేస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

## నోయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రాయం

### ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

**నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య**

**పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు**




**న్యూఢిల్లీ :** మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-దిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇకపోతే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదు-రవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా

కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

## తదుపరి తమ టార్గెట్ క్యూబా అంటూ హెచ్చరిక



**వాషింగ్టన్ :** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

# ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం

## అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

**ప్యారిస్ :** ఇరాన్‌పై అనుకున్న సమయం కంటే ముందే దాడులను ముగిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. మరికొన్ని వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుందని తెలిపారు. ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. తమ దాడులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తవుతాయని, అప్పటికి టెహ్రాన్ పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జీ-7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రుబియో మాట్లాడారు. 'హోర్ముజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే మా తక్షణ కర్తవ్యం. ఆ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం మాకు సందేశాలు పంపింది. అయితే మేం ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు' అని రుబియో తెలిపారు. పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలగాల మోహరింపును ఇటీవల భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా రుబియో మాట్లాడారు. 'ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని మేం అనుకోవడం లేదు. కానీ, అత్యవసర పరిస్థితులు తలెత్తితే మాత్రం భూతల దాడులకు దిగక తప్పదు. అందుకే అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నాయి' అని రుబియో స్పష్టం చేశారు.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

## 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు



**లాస్‌ఏంజిల్స్ :** ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

## అగ్నికి ఆహుతి అయిన పందిళ్లు

## ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ

**అయోధ్య :** అయోధ్యలోని యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌ఘాట్‌లో బటి బాబా ఆశ్రమం సమీపంలో ఉన్న మహాలక్ష్మి నారాయణ యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద పెద్ద పందిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 10 అగ్నిమాపక వాహనాలు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని ఉత్తర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి దయాశంకర్ సింగ్ అన్నారు. మార్చి 20 నుంచి మార్చి 28 వరకు యజ్ఞం జరిగిందని.. తొమ్మిది రోజుల పాటు జరిగిన మహాయజ్ఞం ముగిశాక ఈ అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. యజ్ఞశాల ఖాళీగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. కానీ లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉన్న యజ్ఞశాల నిమిషాల వ్యవధిలోనే బూడిదైపోయింది. ఈ భారీ అగ్నిప్రమాదం రామ మందిరానికి కేవలం 800 మీటర్ల దూరంలో జరిగింది. శనివారం ఉదయం సుమారు 11:30 గంటలకు పూర్ణాహుతితో యజ్ఞం ముగియగానే.. భక్తులు ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేసేందుకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతామని మంత్రి తెలిపారు. యంత్రాంగం ఈ విషయంపై దర్యాప్తు చేస్తోందని, అసలు కారణం త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.

# బెంగాల్లో గెలిచాక ఢిల్లీలో పాగా వేస్తాం

## మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

**కోల్‌కతా :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' పక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన

వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గ్దదె దించుతానని హెచ్చరిక చేశారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

## ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్ :** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయి-ంతే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమాయక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# రోజూ ఒక నారింజ పండును తప్పనిసరిగా తినాల్సిందే..



నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చలికాలం సీజన్ లో ఇవి మనకు మార్కెట్‌లో ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అత్యధిక మొత్తంలో లభించే పండ్లలో నారింజ పండు కూడా ఒకటి. నారింజ పండ్లను అనేక రకాలుగా తీసుకోవచ్చు. వీటిని నేరుగా అలాగే తినవచ్చు. లేదా జ్యూస్ చేసి తాగవచ్చు. ఇతర పండ్లతో కలిపి సలాడ్ రూపంలోనూ తినవచ్చు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి నారింజ పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. రోజూ కచ్చితంగా ఒక నారింజ పండును తినాలని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఈ పండ్లను కచ్చితంగా రోజూ తినాలని వారు చెబుతున్నారు.



**విటమిన్ సి..**


నారింజ పండ్లలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి అధికంగా లభించే పండ్లలో నారింజ పండు ముందు వరుసలో నిలుస్తుంది. ఒక మీడియం సైజు నారింజ పండును తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. విటమిన్ సి వల్ల చర్మానికి సైతం ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

నారింజ పండ్లను తినడం వల్ల విటమిన్ బి6 అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి నారింజ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ ఒక నారింజ పండును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటుంటే కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నారింజ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**డయాబెటిస్ ఉన్నవారు కూడా..**

డయాబెటిస్ ఉన్నవారు సైతం నారింజ పండ్లను తినవచ్చు. ఇందులో భయం చెందాల్సిన పనిలేదు. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది అపోహే. ఇందులో నిజం లేదు. ఎందుకంటే నారింజ పండు గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ 40గా ఉంటుంది. అందువల్ల ఈ పండును తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా ఈ పండ్లను రోజూ తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. ఇక ఈ పండ్లలో సిట్రేట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీల్లో స్టోన్లు ఏర్పడకుండా చూస్తాయి. అందువల్ల కిడ్నీ స్టోన్లు ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే మూత్రం పీహెచ్ స్థాయిలు సరైన రీతిలో ఉంటాయి. దీని వల్ల మూత్రాశయం, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.



## రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే..
### ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?

ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. రోజూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. దీంతో వారికి చక్కని వ్యాయామం జరిగేది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా శారీరక దారుఢ్యం ఉండేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులోనే అన్ని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం వ్యాయామం లేదా శారీరక శ్రమ లేకపోవడమే అని చెప్పవచ్చు. కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అయితే మనకు అనేక రకాల వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా మంది తమకు సౌకర్యవంతంగా ఉండే వ్యాయామాలను చేస్తుంటారు. ఇక అలాంటి వ్యాయామాల్లో స్కిప్పింగ్ కూడా ఒకటి. దీన్నే రోప్ జంపింగ్ లేదా స్కిప్పింగ్ రోప్స్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాయామాన్ని చాలా మంది చేస్తుంటారు. అయితే దీన్ని రోజూ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి.

**గుండెకు చక్కని వ్యాయామం..**

స్కిప్పింగ్ ను రోజూ కనీసం 30 నిమిషాల పాటు చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే స్కిప్పింగ్ అసలు అలవాటు లేని వారు రోజుకు 30 నిమిషాలు చేయడం కష్టం అవుతుంది. కనుక ముందుగా 5 నిమిషాలతో ప్రారంభించాలి. క్రమంగా ఆ సమయాన్ని పెంచుతూ పోవాలి. దీని వల్ల రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేసే సామర్థ్యం వస్తుంది. ఇలా ఈ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. స్కిప్పింగ్ వల్ల గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. దీన్ని అత్యుత్తమ, ఖర్చు లేని కార్డియో వ్యాయామంగా చెప్పవచ్చు. దీని వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా అవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**కొవ్వు కరుగుతుంది..**

స్కిప్పింగ్ వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కార్బన్ డయాక్సైడ్ సులభంగా బయటకు వెళ్లిపోతుంది. స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు చక్కని వ్యాయామం అవుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడలు, పిరుదులకు చక్కని వ్యాయామం అవుతుంది. దీంతో ఆయా భాగాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. శరీరం సన్నగా నాజూగ్గా మారుతుంది. కండరాలు దృఢంగా మారి చక్కని దేహ దారుఢ్యం సొంతమవుతుంది. శరీరంలో శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ద కంపోతుంది. ఈ వ్యాయామం చేయడం వల్ల శరీరం లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది. రోజూ 30 నిమి షాల పాటు స్కిప్పింగ్ చేస్తే శరీరం సుమారుగా 300 క్యాలరీల వరకు శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు.

**ఎముకల ఆరోగ్యానికి..**

స్కిప్పింగ్ చేయడం వల్ల చర్మం సైతం సురక్షితంగా ఉంటుంది. చర్మానికి రక్త సరఫరా పెరుగుతుంది. పోషకాలు లభిస్తాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. చర్మం శుభ్రంగా మారుతుంది. ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరు-స్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. సాధారణంగా వయస్సు మీద పడే కొద్దీ ఎముకలు బలహీనంగా మారుతాయి. దీనికి క్యాల్షియం లోపం తోడైతే ఎముకలు పెళుసుగా మారి త్వరగా విరిగిపోయేందుకు అవకాశాలు ఉంటాయి. అయితే రోజూ స్కిప్పింగ్ చేస్తే వృద్ధాప్యంలో ఎముకల సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు తమ పరిశోధనల్లో తేల్చారు. స్కిప్పింగ్ చేయడం వల్ల వృద్ధాప్యంలో ఎముకలు చాలా బలంగా మారుతాయి. ఇలా ఈ వ్యాయామం మనకు ఎంతో మేలు చేస్తుంది. కనుక రోజూ స్కిప్పింగ్ చేయడం మరిచిపోకండి.

# అధిక బరువుతో అవస్థలు పడుతున్నారా..?

## అయితే ఈ పండ్లను రోజూ తినండి, ఎంతో మేలు జరుగుతుంది..!

ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.



**బెర్రీలు, యాపిల్..**

అధిక బరువు తగ్గేందుకు గాను బెర్రీ పండ్లు ఎంతో దోహదం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతో సహాయం చేస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సైతం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే రాదు అని అంటుంటారు. ఆ ప్రకారమే రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే శరీరంలోని కొవ్వును కరిగించుకుని అధిక బరువును తగ్గించుకోవచ్చు. బరువు తగ్గేలా చేయడంలో యాపిల్స్ ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే ఫైబర్ బరువును నియంత్రణలో ఉంచుతుంది.

**గ్రేప్ ఫ్రూట్, పుచ్చకాయలు..**

అధిక బరువు సమస్యతో బాధపడుతున్నవారికి గ్రేప్ ఫ్రూట్ కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే బరువు తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఈ పండ్లలో అధికంగా ఉండే విటమిన్లు సి, ఎ బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. పుచ్చకాయలు మనకు కేవలం వేసవిలోనే కాదు, ప్రస్తుతం అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటున్నాయి. అందువల్ల పుచ్చకాయలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలిగి ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తినేలా చేస్తాయి. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది.

**పియర్స్, కివి, అవకాడో..**

పియర్స్ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకున్నా కూడా మేలు జరుగుతుంది. ఈ పండ్లు కూడా బరువును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ పండ్లలోనూ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బరువు తగ్గేలా చేస్తుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది. రోజూ ఒక కివి పండును తింటున్నా కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. కివి పండ్లను తింటే ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకోవచ్చు. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. రోజూ ఒక అవకాడోను తింటున్నా కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఈ పండ్లలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా బరువు తగ్గేందుకు కూడా దోహదం చేస్తాయి. ఇలా ఆయా రకాల పండ్లను తరచూ తింటుంటే అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు. ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం,

గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 29 మార్చి 2026


# ఆర్‌సీబీ ఘన విజయం

## హైదరాబాద్‌పై కోహ్లీ, పడిక్కల్ విజృంభణ






బెంగళూరు: ఐపీఎల్ 19వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కు అదిరిపోయే ఆరంభం. చిన్నస్వామి స్టేడియంలో ఉద్విగ్నభరిత క్షణాల మధ్య శనివారం జరిగిన లీగ్ తొలి పోరులో ఆర్‌సీబీ దుమ్మురేపింది. వేలాది మంది ప్రేక్షకుల మధ్య సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో(26 బంతులు మిగిలుండగానే) సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు సీజన్‌లో ఐపీఎల్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడిన ఆర్‌సీబీ చాంపియన్ ఆటతీరు కనబరిచింది. టాస్ గెలిచిన ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్..హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు.

కెప్టెన్ ఇషాన్ కిషన్(38 బంతుల్లో 80, 8ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో హైదరాబాద్ 20 ఓవర్లలో 201/9 స్కోరు చేసింది. క్లాసెన్(31), అనికేత్(43) రాణించడంతో హైదరాబాద్ పోరాడే స్కోరు దక్కింది. అరంగేట్రం బౌలర్ జాకబ్ డఫీ(3/22), రొమారియో షెఫర్డ్(3/54) మూడేసి వికెట్లతో రాణించారు. లక్ష్యఛేదనలో విరాట్‌కోహ్లీ(38 బంతుల్లో 69 నాటౌట్, 5ఫోర్లు, 5 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్(26 బంతుల్లో 61, 7ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో బెంగళూరు 15.4 ఓవర్లలో 203/4 స్కోరు చేసింది. డేవిడ్ పైన్(2/35)రెండు వికెట్లు తీశాడు. డఫీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. కోహ్లీ, పడిక్కల్ ధనాధన్:

లక్ష్యఛేదనలో ఆర్‌సీబీ బ్యాటర్లు ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న ఫిల్ సాల్ట్..నితీశ్‌కుమార్‌రెడ్డి బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకుపడ్డా అదే జోరు కొనసాగించలేకపోయాడు. ఉనద్కట్ రెండో ఓవర్‌లో భారీ షాట్ ఆడబోయిన సాల్ట్ మిడాఫ్‌లో క్లాసెన్ చేతికి చిక్కాడు. ఒకే క్యాచ్ కోసం ఇద్దరు ప్రయత్నించినా ఆఖరికి క్లాసెన్‌కే దక్కడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది. డఫీ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవదత్ పడిక్కల్ క్రీజులోకి వచ్చి రావడంతోనే సిక్స్‌తో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. దేశవాళీ సీజన్‌లో సూపర్ ఫామ్‌ను ఐపీఎల్‌లో కొనసాగిస్తూ పడిక్కల్ అలవోకగా బౌండరీలు బాదడంతో స్కోరుబోర్డు ఊపందుకుంది. మరో ఎండ్‌లో కోహ్లీ కూడా బ్యాటు ఝులిపించడంతో పరుగుల రాక సులువైంది.

డేవిడ్ పైన్ నాలుగో ఓవర్‌లో పడిక్కల్ విశ్వరూపం చూపించాడు. రెండు భారీ సిక్స్‌లు, ఓ ఫోర్‌తో పడిక్కల్ 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్‌లో తన వంతూ అంటూ కోహ్లీ కూడా రెచ్చిపోవడంతో 50 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆర్‌సీబీ వికెట్ కోల్పోయి 76 పరుగులు చేసింది. 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి కోహ్లీ బయటపడగా, 8.1 ఓవర్లలో ఆర్‌సీబీ 100 పరుగుల మార్క్ అందుకుంది. ఇన్నింగ్స్ ఊపందుకుంటున్న తరుణంలో అప్పటికే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పడిక్కల్..దూబే బౌలింగ్‌లో ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్న కోహ్లీ..కెప్టెన్ పాటిదార్(31)తో కలిసి ముందుకు నడిపించాడు. అయితే పైన్ బౌలింగ్‌లో పటిదార్, జితేశ్(0) వెంటవెంటనే ఔటైనా..ఆఖర్లో డేవిడ్(16 నాటౌట్)తో కలిసి కోహ్లీ గెలుపు తీరాలకు చేర్చాడు.

### ఇషాన్ ఒక్కడే:

ఇషాన్ కిషన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. సహచరులు విఫలమైన వేళ తన ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టుకు భారీ స్కోరు అందించాడు. హెడ్(11), అభిషేక్(7) స్వల్ప స్కోర్లకే వెనుదిరుగగా, కిషన్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. మిడిలార్డర్‌లో నితీశ్(1), సలీల్ అరోరా(9), హర్ష్‌దూబే(3) ఇలా వచ్చి ఆలా వెళ్లారు. క్లాసెన్‌తో కలిసి కిషన్ ఇన్నింగ్స్..హైదరాబాద్ 200ల స్కోరుకు కారణమైంది. దీనికి తోడు ఆఖర్లో అనికేత్ దూకుడుగా ఆడటం కలిసొచ్చింది.

### సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 201/9(కిషన్ 80, అనికేత్ 43, డఫీ 3/22, షెఫర్డ్ 3/54),బెంగళూరు: 15.4 ఓవర్లలో 203/4(కోహ్లీ 69 నాటౌట్, పడిక్కల్ 61, పైన్ 2/35, ఉనద్కట్ 1/29)



# అనిరుధ్ - కావ్య మారన్ పెళ్లి?

## కోలీవుడ్ మీడియాలో సెన్సేషనల్ న్యూస్..

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఒకరు మ్యూజిక్ సెన్సేషన్.. మరొకరు బిజినెస్ సామ్రాజ్యానికి వారసురాలు. ఇప్పుడు వీరిద్దరి చుట్టూ ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది. గత కొద్ది రోజులుగా తమిళ మీడియాలో ఈ వార్త తెగ హల్‌చల్ చేస్తోంది. అనిరుధ్, కావ్యా మారన్ మధ్య సాన్నిహిత్యం ఎప్పటి నుంచో ఉంది. అనిరుధ్ తన కెరీర్‌లో అత్యధిక విజయవంతమైన చిత్రాలను సన్ పిక్చర్స్ బ్యానర్‌లోనే అందించారు. రజనీకాంత్ జైలర్ నుంచి విజయ్ లియో వరకు సన్ నెట్‌వర్క్ నిర్మించిన సినిమాలకు అనిరుధ్ అందించిన మ్యూజిక్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ క్రమంలోనే కావ్యా మారన్ తో అనిరుధ్ కు పరిచయం ఏర్పడిందని, అది కాస్తా ప్రేమగా మారిందని టాక్. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోసం అనిరుధ్ ప్రత్యేకంగా సాంగ్ కంపోజ్ చేయడం కూడా ఈ రూమర్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ ఏడాది జూన్ నెలలో అనిరుధ్, కావ్యా మారన్ కలిసి విదేశాల్లో తిరుగుతున్నట్లు కొన్ని ఫోటోలు రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించాయి. వీరు కలిసి లాస్ వెగాస్ వీధుల్లో షికారు చేశారని, కొన్ని ఖరీదైన రెస్టారెంట్లలో డిన్నర్ డేట్‌లకు వెళ్లారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ ఫోటోలు బయటకు వచ్చినప్పటి నుండి వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారనే వార్తలకు రెక్కలు వచ్చాయి. తాజాగా వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయని, త్వరలోనే నిశ్చితార్థం ఉండబోతోందని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇటీవల ఒక సినిమా వేడుకలో అనిరుధ్ పాల్గొన్నప్పుడు మీడియా ప్రతినిధులు ఆయన పెళ్లి గురించి ప్రశ్నించారు. "అనిరుధ్ గారు, మీ పెళ్లి శుభలేఖ ఎప్పుడు ఇస్తున్నారు?" అని అడగ్గా.. అనిరుధ్ ఒక్క క్షణం ఆగి, నవ్వుతూనే చిన్నపాటి అసహనంతో మళ్లీ ఇదేనా? అని బదులిచ్చి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆయన ఈ వార్తలను పూర్తిగా ఖండించకపోవడం, కేవలం దాటవేయడం చూస్తుంటే ఏదో ఉందనే అనుమానాలు ఫ్యాన్స్ లో బలపడుతున్నాయి. మరోవైపు అనిరుధ్ ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటూ కెరీర్ పీక్స్ లో ఉన్నారు. ఒకరు తన సంగీతంతో ప్రపంచాన్ని ఊపేస్తున్న ఆర్టిస్ట్.. మరొకరు పవర్‌ఫుల్ బిజినెస్ సామ్రాజ్యాన్ని నడిపిస్తున్న మహిళ. వీరిద్దరి కలయిక నిజంగానే జరిగితే అది ఈ దశాబ్దంలోనే అతిపెద్ద బిగ్ వెడ్డింగ్ అవుతుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం అనిరుధ్ వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉండగా, కావ్యా మారన్ ఐపీఎల్ 2026 సీజన్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. మరి ఈ జంట నిజంగానే పెళ్లి పీటల వరకు వెళ్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# చెన్నైకి బిగ్ షాక్

## ఐపీఎల్‌కు ధోనీ దూరం



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అభిమానులకు నిరాశ కలిగించే వార్త. ఆ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీ గాయం కారణంగా టోర్నమెంట్‌లోని మొదటి రెండు వారాలకు దూరమయ్యాడు. పిక్క కండరాల నొప్పితో బాధపడుతున్న ధోనీకి విశ్రాంతి అవసరమని, ప్రస్తుతం అతను రిహాబిలిటేషన్‌లో ఉన్నాడని ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్ 19వ ఎడిషన్ ఇవాళ ప్రారంభం కానుండగా, చెన్నై సూపర్ కింగ్స్ సోమవారం గువాహటిలోని బర్సపరా స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందే ధోనీ దూరం కావడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. "ఎంఎస్ ధోనీ పిక్క కండరాల గాయం నుంచి కోలుకుంటున్నారు. ఫలితంగా అతను ఐపీఎల్ 2026 తొలి రెండు వారాలకు దూరమయ్యే అవకాశం ఉంది" అని సీఎస్కే ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ ప్రకటన వెలువడటానికి కొన్ని గంటల ముందే, చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ వీడియోను సీఎస్కే పంచుకుంది. ఆ వీడియోలో 44 ఏళ్ల ధోనీ అద్భుతమైన ఫామ్‌లో కనిపించాడు. అలవోకగా భారీ షాట్లు ఆడుతూ బంతిని చాలాసార్లు బౌండరీ దాటించాడు. ఆ వీడియో చూసిన అభిమానులు ఈ సీజన్‌లో ధోనీ మెరుపులు ఖాయమని భావిస్తున్న తరుణంలో గాయం వార్త వారిని నిరాశపరిచింది. ధోనీ గైర్హాజరీలో వికెట్ కీపింగ్ బాధ్యతలను సంజు శాంసన్ స్వీకరించే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఆటగాళ్ల ట్రేడింగ్ సమయంలో రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్కే తీసుకుంది. అదే సమయంలో ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, శామ్ కరన్‌లను వదులుకుంది. వీరిలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ మరో గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్‌కు పూర్తిగా దూరమయ్యాడు. ఇప్పుడు సీఎస్కే తమ తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుండటం ఆసక్తికరంగా మారింది. ఒకప్పుడు రాజస్థాన్ కెప్టెన్‌గా ఉన్న శాంసన్ ఇప్పుడు సీఎస్కే తరఫున ఆడుతుండగా, సీఎస్కే కీలక ఆటగాడిగా ఉన్న జడేజా రాజస్థాన్ జట్టులో చేరాడు. దీంతో వీరిద్దరూ తమ మాజీ జట్లపై తలపడనుండటం ఈ మ్యాచ్‌పై అంచనాలను మరింత పెంచింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్కే, తమ ఆరో టైటిల్ వేటను ధోనీ లేకుండా ఎలా ప్రారంభిస్తుందో చూడాలి.

## చిన్నస్వామి స్టేడియంలో... తొక్కిసలాట మృతుల స్మారకార్థం ఖాళీ సీట్లు

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌కు ముందు బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు, గతేడాది ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మంది అభిమానులకు నివాళులర్పించారు. ఇరు జట్ల ఆటగాళ్లు, అధికారులు, అభిమానులు ఒక నిమిషం మౌనం పాటించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గౌరవసూచకంగా ఇరు జట్ల ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ధరించి మైదానంలోకి అడుగుపెట్టారు. ఆర్సీబీ ఆటగాళ్లు వార్మప్ సమయంలో '11' నంబర్ ఉన్న జెర్సీలను ధరించి అభిమానుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఐపీఎల్ నిర్వాహకులు తమ 'ఎక్స్' ఖాతాలో, "గతేడాది జూన్ 4న ప్రాణాలు కోల్పోయిన 11 మంది ఆర్సీబీ అభిమానులకు నివాళి. వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి" అని పేర్కొన్నారు. గతేడాది ఆర్సీబీ తమ తొలి ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సందర్భంగా స్టేడియం వెలుపల జరిగిన సంబరాల్లో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన తర్వాత భద్రతా కారణాల దృష్ట్యా స్టేడియంలో క్రికెట్‌ను నిలిపివేశారు. దీనివల్ల 2025 మహిళల వన్డే ప్రపంచకప్, 2026 పురుషుల టీ20 ప్రపంచకప్‌తో పాటు పలు దేశీయ టోర్నీలకు బెంగళూరు ఆతిథ్యం కోల్పోయింది. వెంకటేష్ ప్రసాద్ నేతృత్వంలోని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్ సీఏ), ప్రేక్షకుల నిర్వహణ, స్టేడియం మౌలిక సదుపాయాల్లో భారీ మార్పులు చేసింది. అభిమానుల జ్ఞాపకార్థం స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద ఒక స్మారక ఫలకాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ విషాదం తర్వాత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య చిన్నస్వామిలో జరుగుతున్న తొలి ప్రధాన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. అంతేకాకుండా, మరణించిన 11 మంది అభిమానుల గౌరవార్థం స్టేడియంలో 11 సీట్లను శాశ్వతంగా వారికి కేటాయించారు.







# ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ గ్రీన్ సిగ్నల్

గత ఏడాదిన్నర కాలంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి 'క్రికెట్ దౌత్యాన్ని' ఆయుధంగా ఎంచుకుంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాలపై ఉన్న అడ్డంకులను తొలగించింది. ఈ నిర్ణయం ద్వారా ఇరు దేశాల మధ్య మళ్లీ క్రికెట్ సంబంధాలు బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ నూతన సమాచార, ప్రసార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వపన్ శనివారం ఈ కీలక ప్రకటన చేశారు. ఐపీఎల్ ప్రసారాలను తాము అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ఛానల్ లేదా బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. క్రీడలను, రాజకీయాన్ని వేర్వేరుగా చూడాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ తమ దేశంలో మ్యాచ్‌లను చూపిస్తే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు విడుదల చేయడంతో పెద్ద దుమారం రేగింది. అప్పట్లో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణించి భారత్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగానే ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేయడంతో పాటు, భారత్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో కూడా బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకుండా అడ్డుకుంది. దీనివల్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భారీగా నష్టపోయింది. బంగ్లాదేశ్ ప్రభుత్వ తాజా నిర్ణయంతో అక్కడ ఉన్న లక్షలాది మంది ఐపీఎల్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 19వ సీజన్ ప్రారంభం రోజే ఈ అనుమతి రావడం విశేషం. ఇది కేవలం ప్రసారాలకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్లలో బంగ్లాదేశ్ ఆటగాళ్లు మళ్లీ ఐపీఎల్ జట్లలో చేరడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు. భారత్-బంగ్లాదేశ్ మధ్య మళ్లీ క్రికెట్ సిరీస్‌లు జరిగేలా కొత్త ప్రభుత్వం పావులు కదుపుతోంది.

# అల్ఫోర్స్‌లో ఎన్సీసీ-ఆపదమిత్ర శిక్షణ శిబిరం ముగింపు



కరీంనగర్, మార్చి 28: స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన యువ ఆపదమిత్ర శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, ఎన్సీసీ 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, దేశభక్తి ప్రతి పౌరునికి అత్యంత ముఖ్యమైన విలువలని, అవే దేశ ప్రగతికి పునాదులని పేర్కొన్నారు. దేశ రక్షణలో ఎన్సీసీ పాత్ర విశిష్టమైనదని, విద్యార్థుల్లో కర్తవ్యబోధ, బాధ్యతా భావం పెంపొందించడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న వయసులోనే దేశం పట్ల బాధ్యతలు, హక్కులు, కర్తవ్యాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఎన్సీసీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. శిబిరం ద్వారా విద్యార్థులకు విపత్తు నిర్వహణ, ప్రాథమిక సహాయక చర్యలపై విస్తృత అవగాహన కల్పించారు. ప్రాయోగిక విధానాల్లో నిర్వహించిన శిక్షణ, విన్యాసాలు కేడెట్లకు విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యేలా చేశాయి. ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో రోప్ రెస్క్యూ టెక్నిక్స్, సెర్చ్ అండ్ రెస్క్యూ విధానాలపై ప్రదర్శనలు నిర్వహించారు. ఈ విన్యాసాలు కేడెట్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయి. శిబిరంలో పాల్గొన్న కేడెట్లకు పౌష్టికాహారం, వసతి వంటి అన్ని సౌకర్యాలు సమృద్ధిగా కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కేడెట్లను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. వారం రోజులపాటు శిబిరం నిర్వహణకు సహకరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యానికి ఎన్సీసీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కర్నల్ వి. కృష్ణ, సుబేదార్ మేజర్ జె. సూర్య ప్రసాద్, ఏఎన్ఓలు, జీసీఐలు, పీఐ సిబ్బంది మరియు ఎన్సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

# సుందరగిరి వారసంత వేలం రూ. 7.73 లక్షలు



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని సుందరగిరి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన గొర్రెలు, మేకల వారసంత బహిరంగ వేలం పాటను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం ప్రక్రియలో హుస్నాబాద్‌కు చెందిన వ్యాపారి ఐలేని కిషన్ రెడ్డి రూ. 7,73,000 కు సంతను కైవసం చేసుకున్నారు. గత ఏడాది ఈ వారసంత వేలం ద్వారా రూ. 7 లక్షల ఆదాయం రాగా, ఈసారి అదనంగా రూ. 73 వేలు పెరిగి గ్రామ పంచాయతీ ఖజానాకు భారీగా ఆదాయం చేకూరింది. ఈ వేలం కార్యక్రమానికి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేలం పాటలో పారదర్శకత పాటించడం వల్ల గత ఏడాది కంటే ఈసారి గణనీయమైన ఆదాయం పెరిగిందని ఆయన కొనియాడారు. ఇలా సమకూరిన నిధులను గ్రామ అభివృద్ధి పనులకు వెచ్చించాలని ఆయన సూచించారు. పంచాయతీకి ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయం రావడంతో గ్రామస్తులు, పాలకవర్గం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామ కార్యదర్శి సంపత్, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్,గిరబోయిన రవిందర్,శ్రీమూర్తి శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

## భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా



**భద్రాచలం,మార్చి 28 :** భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మార్చి 28 :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

## వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు

**భద్రాచలం,మార్చి28 :** భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# మంటలు చెలరేగి కారు దగ్ధం

యాదాద్రి భువనగిరి,మార్చి28(ఆర్ఎన్ఎ): బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.

## అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో

**న్యూఢిల్లీ,మార్చి28 :** విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే నడపాలి

## ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోం

## జేఏసీ జిల్లా చైర్మన్ ఎం.పి. రెడ్డి

## 30న కరీంనగర్ 2 డిపో ఎదుట భారీ ధర్నా



హుస్నాబాద్: ఆర్టీసీలోకి వస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను పూర్తిగా సంస్థ యాజమాన్యం పరిధిలోనే నడపాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎం.పి. రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో యాజమాన్యం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు కార్మికులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం జేఏసీ ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్ 2 డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ధోరణిని సహించబోమని, యాజమాన్యం తన పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30వ తేదీన కరీంనగర్ 2 డిపో ఎదుట నిర్వహించనున్న భారీ ధర్నాను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికులకు అనుగుణంగా ఉండాలి తప్ప, వారికి వ్యతిరేకంగా ఉంటే ఊరుకునేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ కె. కొమురయ్య, కన్వీనర్ జె. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల రక్తం తాగుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు

## వేధింపులు ఆపకపోతే ఊరుకోం

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్



హుస్నాబాద్,జనత న్యూస్:ఆకర్షణీయ-మైన ప్రకటనలతో ప్రలోభపెట్టి పేద ప్రజల రక్తాన్ని తాగుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అరచేతిలో స్వర్గం చూపిస్తూ లోన్ల పేరుతో ఈ సంస్థలు పేదల కుటుంబాలను బజారున పడేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకొని పలు ప్రైవేటు కంపెనీలు యమపాశం కంటే ఘోరంగా ప్రాణాలు తీస్తున్నాయని మండిపడ్డారు. బ్యాంకులతో ఒప్పందాల పేరుతో క్రిమినల్ నోటీసులు పంపిస్తూ, సామాన్య ప్రజలను మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, నెలవారీ వాయిదాల చెల్లింపుల్లో స్వల్ప ఆలస్యమైనా ఏజెంట్ల ద్వారా చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో భార్యాపిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టలేకపోయినా సరే, ఫైనాన్స్ చిట్టీ కట్టి తీరాలని ఒత్తిడి చేస్తూ బాధితులను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్ల వేధింపుల వల్ల సామాన్యుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని రాజ్ కుమార్ పేర్కొన్నారు. పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి మోసపూరిత ఫైనాన్స్ కంపెనీలపై పోలీసులు, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# గూడెం గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపన



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గూడెం గ్రామంలో బెజ్జంకి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ తో కలిసి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్ నిధుల కింద మంజూరైన 10 లక్షల రూపాయల విలువతో కూడిన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో శనివారం ఆయన రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం ఆవశ్యకత ఎంతో ఉందని, ప్రజలకు సీసీ రోడ్లులు ఉపయోగకరంగా ఉంటాయని, మండలంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్ల అవసరం ఉంటే మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో మాట్లాడి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ యాలాల పర్శరాములు, కార్యదర్శి మెరుగు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బోనాల ఐలయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పట్లో ఆ ఆలోచన లేదన్న సాయి పల్లవి..!



లేడీ పవర్ స్టార్ అంటూ అభిమానులు ముద్దుగా పిలుచుకునే సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచింది. సాయి పల్లవి పెళ్లి గురించి ఇటీవల ప్రముఖంగా చర్చ జరుగుతోంది. ఆమె త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కేందుకు రెడీ అవుతోందంటూ వచ్చిన వార్తలు ఆమె ఫ్యాన్స్‌లో చర్చనీయాంశం అయ్యాయి. తాజాగా సాయి పల్లవి పెళ్లి వార్తలపై క్లారిటీ ఇచ్చింది. సాయి పల్లవి పెళ్లి గురించి పదే పదే వార్తలు రావడానికి ప్రధాన కారణం ఆమె చెల్లి ఇప్పటికే పెళ్లి చేసుకుంది. సాయి పల్లవి చెల్లి పెళ్లి అయింది, కానీ ఇప్పటివరకు సాయి పల్లవి పెళ్లి కాలేదు, అందుకే ఆమె కుటుంబ సభ్యులు పెళ్లి విషయమై ఒత్తిడి చేస్తున్నారని, అందుకే పెళ్లికి సిద్ధం అయిందనే వార్తలు వచ్చాయి. వ్యాపారవేత్త తో పెళ్లికి ఏర్పాట్లు అంటూ కూడా పుకార్లు షికార్లు చేశాయి. దాంతో సాయి పల్లవి సన్నిహితులు అవన్నీ ఒట్టి పుకార్లే అంటూ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినా కూడా సాయి పల్లవి పెళ్లి విషయంలో పుకార్లు ఆగడం లేదు. ఎట్టకేలకు ఆమె నుంచి స్పందన రావడంతో మీడియాలో వార్తలకు చెక్ పడ్డట్లు అయింది. తాజాగా సాయి పల్లవి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడుతూ తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని క్లారిటీ ఇచ్చింది. అంతే కాకుండా అవన్నీ వట్టి పుకార్లే అని చెప్పుకొచ్చింది.



## వాలీబాల్ నేపథ్యంలో వరుణ్ తేజ్ 'బరి'... క్లాప్ కొట్టిన పవన్ కల్యాణ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమా శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. 'బరి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ వేడుక జరిగింది. ఈ సినిమాకు వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. తన సొంత నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదువంశీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలోని వాలీబాల్ క్రీడ ఆధారంగా ఈ సినిమాను హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' అనే హారర్ కామెడీ సినిమా షూటింగ్‌లో చివరి దశలో ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే 'బరి' చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 2027 సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



## అలాంటి ప్రచారం కూడా ఇష్టం లేదా?

బుట్టబొమ్మ పూజా హెగ్డే కెరీర్ విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. ఒకప్పుడు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన భామ వరుసగా స్టార్ హీరోల సరసన నటించి టాప్ పొజిషన్‌కు చేరుకుంది. అయితే తెలుగు సినిమాలను కాదని బాలీవుడ్ వైపు దృష్టి సారించడం ఆమె కెరీర్‌కు కొంత ప్రతిబంధకంగా మారింది. అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్ లభించకపోవడంతో మళ్ళీ ఇప్పుడు టాలీవుడ్‌లో పాగా వేయడానికి కొంత కాలంగా గట్టి ప్రయత్నాలే చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పూజా హెగ్డేకు తమిళంలో వరుస అవకాశాలు వస్తున్నప్పటికీ తెలుగులో మాత్రం అవకాశాలు రావడం లేదు. కేవలం ఒక పాటకే పరిమితం కావడం తన ఇమేజ్‌కు సరిపడదని పూజ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అమ్మడు నటించిన -జిగేల్ రాణి- సాంగ్స్ పెద్ద హిట్ అయినప్పటికీ? సెకండ్ ఇన్నింగ్స్‌లో కేవలం హీరోయిన్‌గానే సత్తా చాటాలని పట్టుదలతో కనిపిస్తోంది. ఐటెం సాంగ్స్ చేయడం వల్ల స్పెషల్ సాంగ్ గర్ల్ అనే ముద్ర పడితే, భవి ష్యత్తులో మెయిన్ లీడ్ రోల్స్ రావడం కష్టమని పూజాహెగ్డే దీర్ఘకాలిక ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పూజా హెగ్డే కోలీవుడ్‌లో కొన్ని సినిమాలు చేస్తోంది. దళపతి విజయ్ హీరోగా నటించిన -జన నాయగన్- లో నటించింది. ఈ సినిమా విజయం సాధిస్తే పూజకు అక్కడ మెరుగైన అవకాశాలు అందుకుంటుంది. -కాంచన 4-లోనూ నటిస్తోంది. అలాగే హిందీలోనే ఓ సినిమా చేస్తోంది. మలయాళం స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తోన్న ఓ తెలుగు సినిమాలోనూ అవకాశం అందుకుంది. నటిగా కొంత బిజీగా ఉన్నప్పటికీ తెలుగు దర్శక, నిర్మాతలు మాత్రం అమ్మడి వైపు చూడటం లేదు. ఇవన్నీ గ్రహించే తెలుగు సినిమాల విషయంలో అనవసరమైన తొందర పాటు నిర్ణయాలు తీసుకోకుండా సరైన సమయం కోసం వేచి చూడటమే ఉత్తమంగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది.



## ముత్యాల మధ్య మంచి ముత్యం కియరా

స్టైల్ ఐకాన్ కియారా అద్వానీ తాజాగా గ్రాజియా మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ప్రత్యేకమైన డిజైనర్ లుక్ లో మెరిపిసోయింది. శరీరమంతా ముత్యాల అల్లికతో తీర్చిదిద్దిన తెలుపు రంగు డిజైనర్ దుస్తుల్లో మెరిసిపోతోంది. నిన్న జరిగిన అవార్డుల వేడుకలో తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన కియారా.. ఇప్పుడు ఈ సరికొత్త లుక్‌తో మరోసారి నెట్టింట సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రముఖ డిజైనర్ క్రేషా బజాజ్ రూపొందించిన ఈ ప్రత్యేకమైన వైట్ అండ్ వైట్ డ్రెస్సులో కియారా ఒక అందమైన శ్వేత వర్ణపు అప్సరసలా కనిపిస్తోంది. ఈ డిజైనర్ వేర్‌లో కియారా ధరించిన బ్రాలెట్.. రఫుల్డ్ ట్యూనిక్ బ్లౌజ్.. పూసల అల్లికతో కూడిన ట్రౌజర్స్ తనకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చాయి. ముఖ్యంగా డ్రెస్ మొత్తం ముత్యాల వంటి పూసల అల్లికతో ఎంతో ముగ్ధమనోహరంగా ఉంది. టాప్ టు బాటమ్ వైట్ అండ్ వైట్ థీమ్‌లో కియారా తన అందంతో అభిమానుల మనసు దోచుకుంటోంది. ఈ ఫోటోషూట్‌లో కియరా మేకప్, హెయిర్ స్టైల్ కూడా ఈ డ్రెస్సుకి తగ్గట్టుగా ఎంతో పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. కేవలం దుస్తులే కాకుండా ఆభరణాలు కూడా ఈ లుక్‌కి మరింత గ్లామర్‌ను అద్దాయి. మీరారీ జువెల్స్ నుండి -ఇన్సిగ్నియా- ఇయర్ రింగ్స్‌తో పాటు జాంబియన్ ఎమరాల్డ్, బ్రెజిలియన్ సిట్రిన్ కలిసిన 18 క్యారెట్ల బంగారు దుద్దులను కియారా ధరించింది. అలాగే అజ్గా బ్రాండ్‌కు చెందిన గోల్డ్ ప్లేటెడ్ రింగ్ తన వేలికి మరింత అందాన్ని తెచ్చింది. ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్త వహించి ఈ కవర్ పేజీ షూట్‌ను ఎంతో గ్రాండ్‌గా ప్లాన్ చేయడం ఆసక్తిని కలిగించింది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com